క్లుప్తంగా

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామరూరల్/కంచికచర్ల: చందాపురం 132కేవీ/33కేవీ సబ్‌స్టేషన్‌కు వచ్చే 132కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 7గంటల నుంచి ఉదయం 10గంటల వరకు విద్యుత్‌సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. స్టాలిన్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

నందిగామరూరల్: మండలంలోని కొండూరు గ్రామంలో అధికారులు సోమవారం డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీర్వో అంజయ్య మాట్లాడుతూ డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీ పారదర్శకంగా సాగేందుకు దోహదపడుతుందని వివరించారు. గ్రామంలోని 500ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ నాగాచారి, గ్రామ నాయకులు తోట నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు తొలగింపు



నందిగామటౌన్: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు. పట్టణంలోని చందర్లపాడు బస్టాండ్ నుంచి రథం సెంటరు వరకు రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న తోపుడు బండ్లను సోమవారం ఆయన తొలగించారు. ముందుగా రోడ్లపై వ్యాపారం నిర్వహణతో కలిగే ఇబ్బందులను చిరు వ్యాపారులకు వివరించారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్ల పక్కన తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం కలుగుతోందన్నారు. చిరు వ్యాపారులు వారికి కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీజీఆర్ఎస్‌కు 13 అర్జీలు

నందిగామరూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు అందాయని ఆర్డీవో కె. బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు, సర్వే విభాగం నాలుగు, మున్సిపాలిటీ ఒకటి, పంచాయతీరాజ్ ఒకటి, ఇరిగేషన్ ఒకటి, కమర్షియల్ ట్యాక్స్ ఒకటి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఒకటి, ఫిషరీస్ ఒకటి, పోలీస్‌శాఖకు సంబంధించి ఒక అర్జీ అందినట్లు తెలిపారు. ఆయా అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



నందిగామ రూరల్: పట్టణంలోని కేవీఆర్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన బీజేపీ నూతన కార్యాలయాన్ని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందుతోందని వివరించారు. రానున్న కాలంలో నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పోరుగంటి నరసింహారావు, పిట్టల శ్రీదేవి, కేదార్‌నాథ్, సీతారామయ్య, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రముఖ సంఘ సంస్కర్త బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 107వ జయంతి వేడుకలు సోమవారం కేఎల్‌రావు నగర్‌లోని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మండల్ చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ రావు, ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్వీ రావు మాట్లాడుతూ దేశంలో 52 శాతంగా ఉన్న బీసీ వర్గాలన్నీ అభివృద్ధి చెందితేనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని, ఒకటి, రెండు వర్గాల అభివృద్ధితో దేశాభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. బీసీల అభివృద్ధి కోసం బీపీ మండల్ 40 అంశాలతో నివేదిక ఇచ్చారని, మండల్ ఇచ్చిన ప్రతి అంశాన్ని అమలుపరిచే వరకు బీసీలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కూర్మాచారి, కేదారేశ్వరరావు, రఘుబాబు, అడ్డూరి రాము, బెవర శ్రీనివాస్, లక్ష్మణరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదువేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



వీరులపాడు: జగన్నాథపురంలో బురదమయంగా మారిన పత్తి పంట(ఫైల్)



కంచికచర్ల మండలం నక్కలంపేటలో వర్షానికి దెబ్బతిన్న పెసర పంట

- ఇటీవల కురిసిన వర్షాలకు రైతులకు తీరనినష్టం
- పూర్తిగా దెబ్బతిన్న పత్తి, పెసరపంటలు
- అప్పులే మిగిలాయంటున్న రైతులు
- పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్

కంచికచర్ల: ఈనెల రెండోవారంలో ఐదురోజుల పాటు ఎడతెరిపి లేకుండా భారీ కురిసిన వర్షాలకు నందిగామ నియోజకవర్గంలో పెసర, పత్తి, మినుము తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఈ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని పంటలు దెబ్బతినడంతో రైతులకు తీరనినష్టం వాటిల్లింది. అప్పులు చేసి పంటల సాగు చేపడితే ఇలా వర్షార్పణం అయ్యిందంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఐదువేల ఎకరాల్లో పంట నష్టం..

నందిగామ సబ్‌డివిజన్‌లో రైతులు 22, 530 హెక్టార్లలో పంటల సాగు చేపట్టారు. రైతులు పత్తి, పెసర, మొక్కజొన్న, కంది, నువ్వులు, సోయాబిన్, మినుము, జొన్న తదితర పంటలు సాగుచేశారు. అయితే ఈ వర్షాలకు లోతట్టు ప్రాంతల్లో సుమారు 5వేలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు సమాచారం. రోజుల తరబడి వర్షపు నీరు నిలబడి పత్తి పంట దెబ్బతింది. కోతకు వచ్చిన పెసర పంట చేతికందకుండాపోయింది.

పంటలు దెబ్బతిన్న గ్రామాలు ఇవే..

నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న లోతట్టు భూముల్లో సాగు చేసిన పత్తి, పెసర పంటలు ఈ వర్షాలకు దెబ్బతిన్నాయి. నందిగామ మండలం జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, మాగల్లు, గోళ్లమూడి, చందర్లపాడు మండలంలోని చందర్లపాడు, కొడవటికల్లు, పొక్కునూరు, ఏటూరు, చింతలపాడు, తోటరావులపాడు, కేతవీరునిపాడు, కంచికచర్లం మండలంలో పరిటాల, నక్కలంపేట, గనిఆత్కూరు, కొత్తపేట, చెవిటికల్లు, గొట్టుముక్కల, పెండ్యాల, వీరులపాడు మండలం జయంతి, వెల్లంకి, కొణతాలపల్లి, తాటిగుమ్మి, బోడవాడ, నరసింహారావుపాలెం, జుజ్జూరు, పెద్దాపురం గ్రామాల పరిధిలో కలిపి మొత్తం ఐదువేలకుపైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఐదురోజుల పాటు కురిసిన వర్షానికి పత్తి చేలో నీరు నిలబడి పత్తి మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. పత్తి పంటను కాపాడుకునేందుకు యూరియా, పొటాష్ చల్లుతున్నప్పటికీ మొక్కలు బతికే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.

అధికారుల లెక్క 3,750 ఎకరాలే...

ఈ భారీవర్షాలకు నియోజకవర్గంలో 3750 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయాధికారులు గుర్తించారు. కంచికచర్ల మండలంలో 1250 ఎకరాలు, నందిగామ మండలంలో 662 ఎకరాలు, చందర్లపాడు మండలంలో 1218 ఎకరాలు, వీరులపాడు మండలంలో 620 ఎకరాలు కలిపి మొత్తం 3,750 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

“పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి..



ఇటీవల కురిసిన వర్షాలకు మాగ్రామ పరిధిలో లోతట్టు ప్రాంతంలోని వేసిన పత్తి, పెసర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నేను కూడా ఐదెకరాల్లో పెసర పంట వేయగా వర్షానికి దెబ్బతింది. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం అందించాలి.

గుదే అక్కారావు రైతు, గొట్టుముక్కల

జిల్లా అధికారులకు నివేదించాం



ఈ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించాం. పత్తి, పెసర పంటలకు అధికంగా నష్టం జరిగింది. దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం.

విజయకుమార్, ఏఓ. కంచికచర్ల”

ఉత్సవాలపై సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా జరుపుకుందామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పిలుపునిచ్చారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై చిల్లకల్లు రోడ్‌లోని శుభమస్తు కల్యాణమండపంలో సోమవారం సాయంత్రం పేట సీఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయాశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనాల కార్యక్రమాలు శాంతియుతంగా పూర్తయ్యేందుకు అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, హిందూ చైతన్యవేదిక రాష్ట్ర కన్వీనర్ పిన్నం వెంగళరావు, పట్టణ ఎస్ఐ జి.రాజు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, ఇతరశాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,

నందిగామ పట్టణంలో..

నందిగామరూరల్: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఐ వైవిఎల్ నాయుడు సూచించారు. పండుగ నిర్వహణకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మంటపాల ఏర్పాటుకు తప్పనిసరిగా ఆయా శాఖల అధికారుల అనుమతులు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.

ముఖ్యంగా పెద్దపెద్ద శబ్దాలు చేసే మైకులు, డీజేలు వినియోగించరాదన్నారు. గ్రామ స్థాయిలో ఆయా శాఖల అధికారులు వినాయక మంటపాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సురేష్‌బాబు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

శ్రీముత్యాలమ్మకు గ్రామోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాసోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారికి సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. రంగు రంగుల పూలతో శోభాయమానంగా అలంకరించబడిన రథంపై అమ్మవారిని ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి వారుపోసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, ఉపాధ్యక్షులు నోముల శివకుమార్, కోశాధికారి అప్పన వెంకట పిచ్చయ్య, కమిటీ ప్రతినిధులు కొంకిమళ్ల సురేష్, శ్రీరంగం, నాగప్రసాద్, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, నాగమల్లేశ్వరాచారి, కుమ్మరి శాలివాహన వంశస్తులు పాల్గొన్నారు.

280 మందికి వైద్య పరీక్షలు



విద్యార్థికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

నందిగామరూరల్: జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కొణతమాత్మకూరు గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 280మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 171 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా 37 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. 68 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు జోష్టి, సంధ్య, సురేష్, అనూష, నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, మన్నే కళావతి, భాస్కరరావు, రాధాకృష్ణ, వినయ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు..

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో సోమవారం విద్యార్థులు, రిటైర్డు ఉద్యోగులకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ అకేరా కంటి వైద్యశాలకు చెందిన డాక్టర్ రెహ్మాన్ పర్యవేక్షణలో స్థానిక నాగార్జున హైస్కూల్‌కు చెందిన 9, 10తరగతుల విద్యార్థులు 50మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. కంటిచూపు, ఆరోగ్య సంరక్షణకు పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు రంగారావు, కార్యదర్శి అబ్బాస్‌ఆలీ, సహ కార్యదర్శి రామారావు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చావా కృష్ణయ్య, శ్రీనివాసరావుపాల్గొన్నారు.

చంద్రశేఖర్ యాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం



కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకునిగా పనిచేస్తున్న జీవీపీ చంద్రశేఖర్ యాదవ్‌కు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'క్వాడ్రాటిక్ ఫ్రీక్వెన్సీ మోడులాటెడ్ థర్మల్ వేవ్ ఇమేజింగ్ ఫర్ కేరెక్టరేజేషన్ ఆఫ్ సాలీడ్స్' అనేఅంశంపై ఆయన చేసిన పరిశోధనలకుగాను కేఎల్‌యూ యూనివర్సిటీ నుంచి ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా చంద్రశేఖర్ యాదవ్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వంశీకిరణ్, కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ మెంబర్ ఎం.సుహాస్, ఆయా విభాగాల అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

ప్రత్యేక రెవెన్యూగా 'శివాపురం'ను గుర్తించండి సారూ!



శివాపురం సచివాలయ భవనం

శివాపురం(పెనుగంచిప్రోలు):మండలంలోని శివాపురం గ్రామపంచాయతీలోని భూసంబంధిత వ్యవహారాలన్ని(రెవెన్యూ) అనిగండ్లపాడు పంచాయతీలో ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు. శివపురాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించడంలో ఐదు దశాబ్దాలుగా పాలకులు, రెవెన్యూ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం గ్రామస్తుల పాలిటశాపంగా మారింది. గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడినప్పటికీ గ్రామ పరిధిలోని సుమారు 1200 ఎకరాలు వ్యవసాయ భూమి అనిగండ్లపాడు రెవెన్యూలో ఉండటంతో గ్రామస్తులు ఆయా పనులపై అనిగండ్లపాడు వెళ్లాల్సివస్తోంది. ఒకవేళ అక్కడ వీఆర్‌ఓలు అందుబాటులో లేకపోతే మండల కేంద్రం పెనుగంచిప్రోలుకు వెళ్లాల్సి వస్తుండటం గ్రామస్తులకు వ్యయప్రయాసలు తప్పడం లేదు.

రెవెన్యూ మ్యాప్‌లో గ్రామం లేదు..

శివాపురాన్ని ప్రత్యేక రెవిన్యూ గ్రామంగా గుర్తించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. అనిగండ్లపాడు, శివాపురం గ్రామాలకు కలిపి మొత్తం 5వేల ఎకరాల భూమి ఉండగా అందులో శివాపురానికి సంబంధించి 76వ సర్వే నంబర్ నుంచి 198 సర్వే నంబర్ వరకు సుమారుగా 1200 ఎకరాల మేర భూములు ఉన్నాయి. అలాగే శివాపురం గ్రామానికి సంబంధించి తెలంగాణాలోని మదుపల్లి, రాయపట్నం రెవెన్యూలో కూడా మరో 500 ఎకరాల వరకు భూములు ఉన్నాయి. దీంతో రెవెన్యూ చిత్రపటంలో శివాపురం గ్రామం లేకుండాపోయింది. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి శివాపురం గ్రామాన్ని అనిగండ్లపాడు రెవెన్యూ నుంచి తప్పించి ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తిస్తూ ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

శివాపురం గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. గ్రామస్తుల వినతి మేరకు అవసరమైన ప్రతిపాదలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం.

శాంతిలక్ష్మి, పెనుగంచిప్రోలు తహసీల్దార్

సాధన ఉన్నత ప్రగతికి సోపానం



విజయవాడకల్చరల్: సాధన ఉన్నత ప్రగతికి సోపానమని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. గుంటూరుకు చెందిన వీఆర్ ఈవెంట్స్, కళా సాధల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు వివిధ రంగాలకు చెందిన వారికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ.. గాయనీ గాయకులు నిరంతరం సాధన చేయాలని సూచించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ కళా సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. గాయనీ గాయకులు చింతా వాసు, సీహెచ్ రజనీ ఆధ్వర్యంలో పలు చిత్ర గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను, అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, కళాసాథ అధ్యక్షుడు బిళ్లా అశోక్‌కుమార్, శ్యాంప్రసాద్, డీవీ వీరభద్రరావు, పరుచూరి విజయలక్ష్మి జోషి, వి.రాము, ఏ సూర్య, రామకృష్ణ, బోలేపల్లి సుబ్బారావు ,నజీర్, సత్య పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సురేష్‌బాబు

నందిగామరూరల్: వినాయక చవితి పండుగను ప్రజలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకోవాలని తహసీల్దార్ సురేష్‌బాబు సూచించారు. పర్యావర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వద్దు మట్టి వినాయకులే ముద్దు అనే నినాదంతో ముద్రించిన కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ప్రజలంతా మట్టితో తయారుచేసిన వినాయకుడి విగ్రహాలనే వినియోగించాలని సూచించారు. జీవరాశులకు హాని చేయకుండా చెరువు, నదుల నీరు కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతిఒక్కరు మట్టి వినాయకులను వినియోగించాలన్నారు. మట్టి వినాయకుల వినియోగతంతో భూతాపం పెరగకుండా ఉంటుందన్నారు. అదేవిధంగా చేతి వృత్తి కళాకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ కారణంగా నీరు కలుషితంతోపాటు వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ లావణ్య, సీనియర్ అసిస్టెంట్ వేణుకుమారి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సీతారామయ్య, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, నరసింహారావు పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్



ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహశీల్దార్, ఏవో, ఎస్ఐలు

వత్సవాయి: 'మార్కెట్‌లో నకిలీ పురుగుమందుల హవా' శీర్షికన 'సాక్షి' దినపత్రిక సోమవారం ప్రచురించిన కథనానికి వత్సవాయి మండల రెవెన్యూ, వ్యవసాయ, పోలీసుశాఖల అధికారులు స్పందించారు. తహశీల్దార్ వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు సంయుక్తంగా మండలకేంద్రం వత్సవాయిలోని పురుగుమందుల విక్రయించే దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలని, వెంటనే సంబంధిత వివరాలను పాస్ మిషన్‌లో నమోదు చేయాలని దుకాణాల యజమానులకు సూచించారు. అదేవిధంగా పొరుగురాష్ట్రాల వారికి అమ్మకాలు చేయరాదని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా ఉండాలని ఆదేశించారు. నకిలీ పురుగు మందుల విక్రయాలు సాగుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

పెనుగంచిప్రోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. స్థానిక సొసైటీ ఆవరణలో గ్రామస్తులకు సోమవారం నూతన స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్‌కార్డుల్లో పూర్తి వివరాలు ఉన్నాయన్నారు. పారదర్శకంగా, వేగవంతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ తేలప్రోలు శేఖర్ పీ4 పథకం కింద ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్ల కోటేశ్వరి, సొసైటీ మాజీ అధ్యక్షులు వేగినేటి గోపాలకృష్ణమూర్తి, కొల్లా రఘురామయ్య, మండల టీడీపీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, గ్రామపార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గజ్జి కృష్ణమూర్తి, నీటిసంఘం అధ్యక్షులు యనమదల నరసింహారావు, కర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల దొంగలు అరెస్ట్

14 మోటార్లు స్వాధీనం

జగ్గయ్యపేటఅర్బన్: నందిగామ డివిజన్ పరిధిల్లోని ఇళ్లు, పొలాలు, ఫ్యాక్టరీల్లో విద్యుత్ మోటార్లను అపహరిస్తూ తప్పించుకొని తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను జగ్గయ్యపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.3.50లక్షల విలువైన 14 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్ఐ జి.రాజు సోమవారం కేసు వివరాలు విలేకరులకు వెల్లడించారు. ఎస్ఐ కథనం మేరకు.. ఈనెల 24వ తేదీన పట్టణ సమీపంలోని షేర్‌మహ్మద్‌పేట క్రాస్‌రోడ్ వద్ద జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజు వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని పట్టుకుని విచారించగా పలు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులు వత్సవాయి మండలం, గోపినేనిపాలెం గ్రామానికి చెందిన బాణావతు ఉపేంద్ర, పెనుగంచిప్రోలు మండలం శివాపురంనకు చెందిన గుగులోతు హుస్సేన్, భూక్యా లక్ష్మ అనేవారుగా పోలీసులు గుర్తించారు. నిందితులు కొన్నినెలలుగా జగ్గయ్యపేట, నందిగామ, గట్టు భీమవరం, జగ్గయ్యపేట పట్టణంలోని ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో 14 విద్యుత్ మోటార్లు చోరీ చేసి, ఆ మోటార్లను జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన దుర్గ అనే వ్యక్తికి విక్రయించినట్లు తెలపడంతో పోలీసులు ఆ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి పోలీసులు, వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు స్థానాలకు బరిలో ముగ్గురు

- కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ పదవులకు ఎన్నికలు
- నేటి సాయంత్రం వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ డైరెక్టర్ల ఎన్నిక నామినేషన్ల ప్రక్రియ సోమవారం జరిగింది. జనరల్ కేటగిరీలో రెండు స్థానాలు, మహిళా కేటగిరిలో ఒక స్థానానికి ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదల కాగా, సోమవారం పాలప్రాజెక్టు ఆవరణలోని క్షీరదర్శిని సమావేశ మందిరంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారి కె.గురునాథం పర్యవేక్షణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. మహిళా విభాగంలో చిట్యాలకు చెందిన బోయపాటి సుశీల, విస్సన్నపేటకు చెందిన నెక్కళపు వాణిశ్రీ నామినేషన్లు దాఖలు చేశారు. అయితే బోయపాటి సుశీల నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇక జనరల్ కేటగిరీలో రెండు స్థానాల కోసం పెడన మండలం పెనుమల్లి గ్రామానికి చెందిన ఆర్జా వెంకట నగేష్, వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన యింజం రామారావు, తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గద్దె రంగారావు నామినేషన్లు దాఖలు చేశారు. రెండు స్థానాలకు ముగ్గురు పోటీలో ఉండటంతో ఎన్నికలు అనివార్యమవుతాయా లేదా అనేది మంగళవారం తేలనుంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

సత్యవ్రత వైభవాన్ని చాటిన 'హరిశ్చంద్ర'

విజయవాడకల్చరల్: విక్కీ కల్చరల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో వినాయక చవితి సందర్భంగా సోమవారం ప్రదర్శించిన నాటికలు పద్యనాటిక వైభవాన్ని చాటాయి. తొలి నాటికగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన హరిశ్చంద్ర నాటకంలోని అడవి సన్నివేశాన్ని రక్తికట్టించేలా ప్రదర్శించారు.1వ హరిశ్చంద్రునిగా తిరువూరుకు చెందిన డీవీ రావ్, 2వ హరిశ్చంద్రునిగా శ్రీనివాసరెడ్డి, చంద్రమతిగా విజయరాణి, నక్షత్రకునిగా ఎస్‌కే బుజ్జి నటించారు. రెండో నాటికగా భక్త కన్నప్ప నాటికను ప్రదర్శించారు. తిన్నడుగా శ్రీనివాసరావు, రుద్రునిగా రమేష్ వేంపాటి, నీలగా అమృత వర్షిణి, కైలాసనాథ శాస్త్రిగా కేఎస్ఆర్ కృష్ణ ప్రసాద్ నటించారు. నాటికలను పత్తిపాటి శ్రీనివాసరావు నిర్వహించారు.